

అక్రమాలకు కేంద్రం.. జలాశయం

సోమశిల జలాశయం లోతట్టు ప్రాంతం అక్రమార్కులకు అడ్డాగా మారింది. నాటు తయారీ, ఎర్రచందనం అక్రమ నిల్వలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,990
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,180
3 శాతం జీఎస్టీతో	రూ.5,335
సవర (8 గ్రా)	రూ.42,680

గరిష్టం/కనిష్టం
29.0 /19.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఈశాన్య గాలుల ప్రభావంగా పగటి పూట చలి తీవ్రత అధికంగా ఉంటుంది. గాలిలో తేమ 62 శాతం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీవారి దివ్యదర్శనానికి భక్తులు పయనం



శ్రీవారి దర్శనానికి బయలుదేరుతున్న భక్తులు

వెంకటాచలం: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సామాజిక సమరసత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి వైకుంఠ వాకిలి దివ్య దర్శనానికి సోమవారం నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్యకార, గిరిజన, దళిత ప్రాంతాల నుంచి 18 బస్సుల్లో భక్తులు బయలుదేరారు. వెంకటాచలంలోని టోల్‌ప్లాజా వద్ద ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రముఖ సలహాదారు పీటీ జగన్నాథం భక్తుల యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో పది రోజుల పాటు తెరిచి ఉంచే వైకుంఠ వాకిలి ద్వారా శ్రీవారి దర్శనం చేయించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుందని చెప్పారు.

ముగిసిన పింఛన్ వారోత్సవాలు

- 97.88 శాతం మందికి పింఛన్ల పంపిణీ



కొడవలూరు మండలం కమ్మపాలెంలో లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మౌనిక శైలజ

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు వాడవాడలా పింఛన్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు కార్డులు, నగదు పంపిణీ చేశారు. జనవరి నుంచి 12,332 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా కొత్తగా పింఛన్లు మంజూరు అయిన లబ్ధిదారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూ రు, కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు డాక్టర్ పి అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి విక్ర మ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.మహీధర్‌రెడ్డి కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. 3,14,237 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుకను అందించాల్సి ఉండగా 3,07,567 మందికి వలంటీర్లు నగదు పంపిణీ చేయడంతో సోమవారానికి 97.88 శాతం పూర్తయింది.

సోమశిలలో 71.997 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం నాటికి 71.997 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 3,879 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 300, కండలేరుకు 200 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.760 మీటర్ల నీటి మట్టం ఉంది.

బిలకూట క్షేత్రానికి రూ.34.70 లక్షల రాబడి

- బ్రహ్మోత్సవాల్లో దుకాణాలకు వేలం పాట

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన వేలం పాటలను సోమవారం నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటల్లో తలనీలాలు సేకరించుకునేందుకు రూ.8,61,500, చెరకు విక్రయానికి రూ.3.61 లక్షలు, తాత్కాలిక దుకాణాలకు రూ.1.05 లక్షలు, కొబ్బరి కాయలు, పూజాద్రవ్యాల విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.5.70 లక్షలు, పాదరక్షలు భద్రపరిచే దుకాణం నిర్వహణకు రూ.35,500 వంతున వేలం ద్వారా రాబడి వచ్చింది. బ్రహ్మోత్సవాల అనంతరం ఏడాది పొడవునా తలనీలాల సేకరణకు రూ.7,54,500, కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాల విక్రయానికి రూ.5.01 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.2.68 లక్షలు పాదరక్షలు భద్రపరుచుకునే దుకాణం ఏర్పాటుకు రూ.13,700 వంతున మొత్తం రూ.34,70,200 వంతున రాబడి వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతుకు దన్నుగా.. ఈ-ఫారం మార్కెట్

రైతులకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటల్లో ప్రభుత్వ రంగ సంస్థలు 30 శాతం మాత్రమే కొనుగోలు చేయగలుగుతున్నాయి. మిగతా 70 శాతం సరుకు దళారులు, కమీషన్ల ఏజెంట్ల ద్వారా వ్యాపారులకు అమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతు ఉత్పత్తులు నూరు శాతం నేరుగా వ్యాపారులకే గిట్టుబాటు ధరకు విక్రయించునే విధంగా దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా ఈ-ఫారం మార్కెట్ మొబైల్ యాప్‌ను రూపొందించింది. దేశ వ్యాప్తంగా వ్యాపారులను అనుసంధానం చేసి నేరుగా రైతులు తమ ఉత్పత్తులను తాము నిర్ణయించిన ధరలకే విక్రయించుకునేట్లు మార్కెటింగ్‌శాఖ మధ్యవర్తిగా వ్యవహరించనుంది. ఉత్పత్తులు విక్రయించిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేయనుంది.

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం



- ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానంలో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు
- దేశ వ్యాప్తంగా 20 వేల మంది వ్యాపారులు యాప్‌తో అనుసంధానం
- రైతులే నేరుగా తమ ఉత్పత్తులను యాప్ ద్వారా విక్రయించుకునే అవకాశం
- రైతుకు, వ్యాపారికి మధ్యవర్తిగా మార్కెటింగ్ శాఖ
- దళారీ, కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ లేకుండా విక్రయాలు
- విక్రయించిన మూడు రోజుల్లో నగదు చెల్లించేలా చర్యలు

➡ దేశంలోనే తొలి ఈ-ఫారం మార్కెట్ మొబైల్ యాప్

eFarmarket
Trade from your doorstep

కందుకూరు: రైతులు పండించిన పంట ఉత్పత్తులను సులభంగా, ఎక్కడ అధిక ధర వస్తే అక్కడ విక్రయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తోంది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందు కోసం 'ఈ-ఫారం మార్కెట్' పేరుతో ఓ మొబైల్ యాప్‌ను రూపొందించి దేశంలోని 20 వేల మంది వ్యాపారులతో అనుసంధానం చేసింది. ఈ యాప్‌లో రైతులే నేరుగా తమ పంట ఉత్పత్తుల వివరాలను నమోదు చేసుకుని, ధరను కూడా నిర్ణయించుకునే అవకాశం కల్పించింది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానం వల్ల రైతులకు విస్తృతమైన మార్కెట్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు.

ఉత్తమ ధరను కల్పించడమే లక్ష్యం

రైతులు ఆరుగాలం పండించిన పంటలకు ఉత్తమ ధరను కల్పించడమే లక్ష్యంగా ఈ-ఫారం మార్కెట్ మొబైల్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ప్రతి రైతు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తన మొబైల్ నంబర్‌తో వివరాలను నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో రైతు తన వద్ద ఏ పంట ఉత్పత్తి ఎంత ఉంది, ఎంత ధరకు విక్రయించుకోవాలని భావిస్తున్నాడో ధరను నిర్ణయించుకోవచ్చు. ఓ రైతు వద్ద మినుములు ఉన్నాయనుకుంటే.. అవి ఎన్ని క్వింటాళ్లు ఉన్నాయి, ఏ క్వాలిటీతో ఉన్నాయి, క్వింటా ఏ ధర ఎంత అనే వివరాలు యాప్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. రైతు నమోదు చేసిన ఈ వివరాలను పరిశీలించిన వ్యాపారులు తమకు కావాల్సిన వారు నేరుగా ఆ రైతు వివరాలతో అనుసంధానం అవుతాడు. ఎంత మొత్తం కొంటారు, ఏ రేటుకు కొనుగోలు చేస్తామనే వివరాలు వ్యాపారులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇదే యాప్‌లో మధ్యవర్తులుగా అనుసంధానమై ఉన్న మార్కెటింగ్ శాఖ అధికారులు ఇటు వ్యాపారితో, అటు రైతుతో మాట్లాడి విక్రయాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటారు. రైతు, వ్యాపారి ఇద్దరి మధ్య అంగీకారం కుదిరిన తర్వాత ఉత్పత్తులను తీసుకెళ్లేందుకు మార్కెటింగ్‌శాఖ అనుమతిస్తుంది. వ్యాపారే నేరుగా రైతు వద్దకు వచ్చి ఉత్పత్తులు చెప్పిన రేటుకు కొనుగోలు చేసి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఖర్చులను సైతం పూర్తిగా వ్యాపారే భరించాల్సి ఉంటుంది. రైతుకు ఎటువంటి సంబంధం ఉండదు.

మూడు రోజుల్లో నగదు జమ

వ్యవసాయ ఉత్పత్తుల విక్రయించిన మూడు రోజుల్లో రైతు ఖాతాకు నేరుగా డబ్బులు జమ చేసే విధంగా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. దీనికి పూర్తి బాధ్యత మార్కెటింగ్‌శాఖ వహిస్తోంది. ప్రస్తుతం పంట చేతికొచ్చిన తర్వాత రైతు నేరుగా కల్లాల్లోనే దళారులు, కమీషన్ ఏజెంట్ల ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు. 15 నుంచి 20 రోజుల తర్వాత కానీ డబ్బులు చెల్లించే పరిస్థితి లేదు. ఇదే క్రమంలో తరుగు, తాలు పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ మార్కెటింగ్ శాఖ అధికారులు సరుకు నాణ్యతను సర్టిఫై చేయడంతో పాటు వ్యాపారులతో ధరలు మాట్లాడి ఒప్పించే బాధ్యత తీసుకుంటున్నారు. అయితే రైతులు తమ ఉత్పత్తులను క్వాలిటీ ఉండేలా చూసుకోవడం ఒక్కటే చేయాలని, క్వాలిటీ ఎంత బాగుంటే అంత మంచి ధర వస్తుందని చెబుతున్నారు. రైతులు తొందరపడి తక్కువ ధరలకు దళారులకు విక్రయించుకోకుండా ఈ-ఫారం మార్కెట్ విధానంలో అత్యంత సులభంగా విక్రయించుకోవచ్చునని సూచిస్తున్నారు.

జిల్లాలో ఈ ఉత్పత్తులకు అవకాశం

జిల్లా నుంచి ఇప్పటికే పలు రకాల ఉత్పత్తులను ఈ విధానంలో మార్కెటింగ్ శాఖ అధికారులు విక్రయాలు చేశారు. దాదాపు రూ. 35 కోట్ల లావాదేవీల వరకు జరిగాయి. వేరుశనగ, బియ్యం, కూరగాయలు, పచ్చి మిర్చి, పత్తి వంటివి తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల వ్యాపారులకు విక్రయాలు చేశారు. కందుకూరు, ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు వంటి ప్రాంతాల్లో అన్ని రకాల పంటలు పండుతాయని, మిగిలిన చోట్ల ధాన్యం ఎక్కువగా పండుతుందని మార్కెటింగ్ శాఖ అధికారులు తేల్చారు. డిమాండ్ ఉన్న రాష్ట్రాల్లో జిల్లా నుంచి ఉత్పత్తులను విక్రయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఈ-ఫారం మార్కెట్ విధానంలో ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. శనగ, వేరుశనగ, మినుము, ఉద్యాన ఉత్పత్తులు, ధాన్యం, బియ్యం ఇలా ఏ పంట ఉత్పత్తి ఉన్నా నేరుగా యాప్‌లో నమోదు చేసుకోవచ్చునని సూచిస్తున్నారు. పండిన ఉత్పత్తుల్లో ప్రభుత్వరంగ సంస్థలైన మార్క్‌ఫెడ్, నాఫెడ్, సివిల్‌సప్లయిస్ వంటి సంస్థలు కేవలం 30 శాతం ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేస్తున్నాయని, మిగిలిన 70 శాతం ఉత్పత్తులను రైతులు దళారుల ద్వారా విక్రయిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ గుర్తించింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ నూతన విధానానికి శ్రీకారం చుట్టిందని అధికారులు పేర్కొంటున్నారు.

రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయాలని సూచన

ఈ విధానంలో ఎక్కడైనా రైతుకు నగదు చెల్లింపులో జాప్యం లేకుండా చూసేందుకు రూ.100 కోట్లతో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖ ప్రభుత్వానికి సూచన చేసింది. ప్రస్తుతం ఇది పరిశీలనలో ఉంది. ఉత్పత్తులను కొనుగోలు చేసిన వ్యాపారస్తుడు ఎవరైనా నిర్ణీత సమయంలో నగదు చెల్లించకలేకపోతే తక్షణం రివాల్వింగ్ ఫండ్ నుంచి రైతుకు నగదు చెల్లించాలనేది అధికారుల ఆలోచన. తర్వాత వ్యాపారి నుంచి వసూలు చేసి రివ్వాలింగ్ ఫండ్‌కు జమ చేస్తారు.

విస్తృత మార్కెటింగ్ సదుపాయం



ఈ-ఫారం మార్కెట్ రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంది. నాణ్యమైన ధరలకు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకోవచ్చు. దేశంలోని వ్యాపారులంతా ఉన్న నేపథ్యంలో డిమాండ్ పెరుగుతోంది. అప్పుడు అధిక ధరలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు జరిగిన విక్రయాల్లో రైతులకు చాలా మేలు జరిగింది. వేరుశనగ, కూరగాయలు వంటి తెలంగాణకు అధికంగా పంపించాం.

– శ్రీనివాసులు, ఏఎంసీ కార్యదర్శి, కందుకూరు

రైతు గిట్టుబాటు ధర పొందవచ్చు



ఈ-ఫారం మార్కెట్ వల్ల రైతులకు వ్యాపార అవకాశాలు బాగున్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం రైతులకు బాగా ఉపయోగపడుతోంది. పండించిన పంటను నేరుగా రైతులే అమ్ముకునేందుకు అవకాశం ఉన్న ఈ విధానంపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పిస్తే బాగుంటుంది. అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోవాలి.

– జె.శ్రీనివాసులు, రైతు, గుడ్లూరు

అన్ని రకాల పంటలు అమ్ముకోవచ్చు



ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్‌లైన్ మార్కెట్ విధానం రైతులకు ఉపయోగపడుతుంది. రైతులు నేరుగా తమ పంటలకు ధర నిర్ణయించుకుని అమ్ముకునే అవకాశం ఉంది. అన్ని రకాల రైతులు ఈ పంటలను ఈ-యాప్‌లో నమోదు చేసుకుని అమ్ముకోవచ్చు. రైతులంతా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే మంచిది.

– పి.మాధవ, రైతు, ఒగూరు

ఇదేనా నీ మానవత్వం

- ప్రజల చావుకు కారణమైన బాబును పరామర్శిస్తావా!
- పవన్‌కల్యాణ్‌పై మంత్రి కాకాణి ధ్వజం



బోడిస్వామికండ్రిగలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ఇదేనా నీ మానవత్వమని, ప్రజలంటే.. ప్రజల ప్రాణాలంటే నీకు, నీ దత్తతండ్రికి లెక్క లేదని పవన్‌కల్యాణ్ పై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు ప్రచారానికి బలైన కుటుంబాలను కాకుండా, ఆ ప్రజల ప్రాణాలు తీసిన చంద్రబాబును పరామర్శించడం చూసి వీరా మన ప్రజానాయకులని ఛీదరించుకుంటున్నారన్నారు. చంద్రబాబు-పవన్ కల్యాణ్ అపవిత్ర కలయికను ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. ముత్తుకూరు పంచాయతీలోని బోడిస్వామికండ్రిగ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సీవీఆర్ నగర్‌ల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాకాణి పాల్గొన్నారు. ఇల్లిల్లూ తిరిగి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ చంద్రబాబు నిర్వహించిన కందుకూరు, గుంటూరు సభల్లో 11 మంది చనిపోతే ఆ కుటుంబాలను పరామర్శించేందుకు రాని పవన్‌కల్యాణ్ వారి మరణానికి కారకుడైన చంద్రబాబును పరామర్శించడం దుర్మార్గమన్నారు.

ప్యాకేజీ గల్లంతుపై విచారణ

మత్స్యకారేతర ప్యాకేజీ నిధులు 2008లో విడుదలైతే 2019 ఎన్నిలకు ముందు పంపిణీ చేసేందుకు సిద్ధపడ్డ సోమిరెడ్డికి ఈ 11 ఏళ్లకు సంబంధించిన వడ్డీ ఇవ్వాలని ఇంగిత జ్ఞానం లేదా అని మంత్రి కాకాణి ధ్వజమెత్తారు. తెల్లరంగు రేషన్‌కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి తాము రూ.25,000 చొప్పున పంపిణీ చేశామన్నారు. ఎన్నికలకు ముందు సోమిరెడ్డి మాత్రం రూ.14,350 మాత్రమే కొందరికి పంపిణీ చేశారని గుర్తు చేశారు. కొంత మంది ఎస్టీల ప్యాకేజీ నిధులు గల్లంతు అయ్యాయని, ఎస్టీల ప్యాకేజీ నిధులు ఎవరు కాజేశారన్న అంశంపై విచారణ జరిపిస్తామన్నారు. ఇప్పటికే 16,000 మందికి ప్యాకేజీ పంపిణీ జరిగిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల మరో 600 మందికి ప్యాకేజీ ఇవ్వాలని, వీటిని కూడా త్వరలో పంపిణీ చేస్తామన్నారు. ప్యాకేజీపై ఉధృతంగా పోరాటం చేస్తామని పిలుపునిస్తే కనీసం 50 మంది కూడా రాలేదని, సోమిరెడ్డి ప్రజల మద్దతు కోల్పోయాడనేది రుజువు అయిందన్నారు. అధికారంలో ఉండి ప్యాకేజీ పంపిణీ చేయలేకపోయిన మీరు ఇప్పుడు మేము పంపిణీ చేస్తుంటే విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంటరమణయ్య, ఎంపీపీ సుగుణమ్మ, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్దన్‌రెడ్డి, వేణుంబాక శేషారెడ్డి, సర్పంచ్ బూదూరు లక్ష్మి, స్థానికులు పోకపూడి నారాయణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం



మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ మలోల

వెంకటాచలం: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆర్డీఓ మలోల, తహసీల్దార్ వై.నాగరాజు ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఐదు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఉదయం చెన్నై నుంచి నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో గూడూరు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో స్వర్ణభారత్ ట్రస్ట్ చేరుకున్నారు. రాత్రి ట్రస్ట్‌లోనే బస చేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు, వెంకటాచలం చుట్టు పక్కల గ్రామాల సందర్శకులను, బుధవారం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన సందర్శలను ట్రస్ట్‌లోనే కలుస్తారు. 12న ఉదయం 10 గంటలకు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అక్షర విద్యాలయంలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. 13న ఉదయం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే సంక్రాంతి సంబరాల్లో , సాయంత్రం నెల్లూరు నగరంలోని ట్రంక్ రోడ్ శివాజీ సెంటర్‌లో గోదాదేవి కల్యాణోత్సవంలో పాల్గొంటారు. 14న ఉదయం నెల్లూరు నగరంలోని తన కుమారుడు నివాసంలో భోగి పండగ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై బయలుదేరి వెళతారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక వైద్యసేవలు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ తదితరులు

నెల్లూరు (అర్బన్): ఈహెచ్‌ఎస్ ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో ప్రత్యేకంగా వైద్య సేవలందించేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపీ, ఐపీ సేవలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా 24 రకాల దీర్ఘకాలిక సమస్యలకు ఇక్కడ వైద్యం అందించనున్నారన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతున్నారని దీంతో బీపీ, షుగర్ వంటి పలు దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. వీరి కోసం దీర్ఘకాలిక వ్యాధుల అవుట్ పేషెంట్ విభాగం సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రభుత్వ ఉద్యోగులు వేచి చూడకుండా సత్వరమే ఈ ప్రత్యేక వైద్య సేవలందుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పదవీ విరమణ పొందిన వారు కూడా ఈ వైద్య సేవలు పొందవచ్చన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన కన్సల్టేషన్, రిసెప్షన్, మందుల స్టోర్, ల్యాబ్ తదితర వాటిని కలెక్టర్‌కు చూపించి వివరించారు. మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ లక్ష్మీసునంద మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉన్న సమస్యలు కలెక్టర్‌కు తెలిపి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేయూత మహిళా మార్ట్ ప్రారంభం



చేయూత మార్ట్‌ను ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే

కందుకూరు: స్థానిక డ్వాక్రాబజార్‌లో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను సబ్‌కలెక్టర్ శోభిక, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్ట్ నిర్వహణపై నిర్వాహకులైన మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిందేందుకు, పొదుపు సంఘాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయడంతో స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. కందుకూరు పట్టణంలో పెద్ద వ్యాపార సంస్థలకు దీటుగా ఇటువంటి మహిళా మార్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు వ్యాపారం వృద్ధి చెందేలా కృషి చేయాలని, అన్ని రకాల వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కొమ్మూరి కనకారావు మాదిగ, సెర్ప్ చేయూత అడిషనల్ డైరెక్టర్ మహిత, చేయూత జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శీనయ్య, డీపీఎంలు తిరుపతయ్య, కిశోర్‌బాబు, ఏపీఎం శ్రీనివాసరావు, తహసీల్దార్ సీతారామయ్య, ఎంపీపీ సుశీల, జెడ్పీటీసీ అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. న్యాయం చేస్తాం



బాధితుడి సమస్యలు వింటున్న ఎస్పీ విజయారావు

- స్పందనలో ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : కన్నబిడ్డలు ఆస్తికోసం చిత్రహింసలు పెడుతున్నారు.. ఉద్యోగాల పేరిట దగా చేశారు.. ప్రేమ పేరిట మోసగించారు.. అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో గాథను పోలీసుల ముందు చెప్పుకోగా.. వారికి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు బాధితులకు భరోసా కల్పించారు. నెల్లూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సీహెచ్ విజయారావు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 72 మంది పాల్గొని తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులను పరిశీలించిన ఆయన సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి నగదు వసూలు చేసే వ్యక్తుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తరహా మోసాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, జి.శ్రీనివాసరావు, సెబ్ జేడీ శ్రీలక్ష్మి, డీఎస్పీలు శ్రీనివాసరావు, గాంధీ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసగించాడు



మేము నిరుద్యోగులం. ఏఎస్‌పేట మండలానికి చెందిన అంకమరాజు మాకు స్నేహితుడు. ఆయన పోస్టల్ ఉద్యోగి. ప్రస్తుతం నెల్లూరు ఏకే నగర్ పోస్టాఫీసులో పనిచేస్తున్నారు. తనకు పై అధికారులతో మంచి సంబంధాలున్నాయని.. ఒక్కొక్కరు రూ.3 లక్షల చొప్పున ఇస్తే పోస్టల్‌శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. స్నేహితుడు కావడంతో గతేడాది మే, జూలై నెలల్లో మేము ముగ్గురం కలిసి రూ.9 లక్షల నగదు ఇచ్చాం. అంకమరాజు నగదుకు గ్యారెంటీ కింద ప్రాంసరీ నోట్లు రాసి ఇచ్చాడు. అయితే నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఉద్యోగం ఇప్పించలేదు. ఇదేమని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడు. తమ లాగే పలువురు మోసపోయారని తెలిసింది. విచారించి న్యాయం చేయండి.

\- ప్రసాద్, సురేష్, జి.ప్రసాద్, ఆత్మకూరు

గొర్రెలు కొని నగదు ఇవ్వలేదు



నేను గొర్రెలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాను. మర్రిపాడు మండలం చుంచులూరు గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి కె.రామయ్య మూడునెలల కిందట మా గ్రామానికి వచ్చాడు. నా వద్ద ఉన్న 74 గొర్రెలను రూ.8.25 లక్షలకు కొనుగోలు చేశాడు. రెండు రోజుల్లో నగదు ఇస్తానని చెప్పి వెళ్లాడు. తెలిసిన వాడు కావడంతో నిర్ణీత గడువులోగా నగదు ఇస్తాడని వేచిచూశాను. రోజులు గడుస్తున్నా నగదు ఇవ్వడం లేదు. అడిగితే సమాధానం చెప్పడంలేదు. న్యాయం చేయండి.

\- బి.నరసింహులు, తెగచర్ల మండలం, రాపూరు

స్పందన వినతులను సత్వరమే పరిష్కరించండి

- కలెక్టర్ చక్రధర్‌బాబు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నెల్లూరు (అర్బన్): స్పందన కార్యక్రమంలో సమస్యలపై ప్రజలు అందజేసే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో తమ సమస్యలు తీర్చాలంటూ అర్జీలు అందజేశారు. కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ స్పందన అర్జీలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. రెవెన్యూ, పురపాలకశాఖలతో పాటు గ్రామ, వార్డు పరిధిలో అత్యధికంగా గతంలో అర్జీలు అందజేసిన వారే మళ్లీ మళ్లీ అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. ఇలా ఎందుకు జరుగుతుందని, విధిగా ప్రమాణాలు పాటిస్తూ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఒక వేళ సమస్యలు పరిష్కరించలేకపోతే ఎందువల్ల పరిష్కరించలేకపోతున్నామో అర్జీదారుడికి అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా, మెప్మా, ఏపీఎంఐపీ పీడీలు వెంకట్రావు, రవీంద్ర, శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, టీజీపీ ప్రత్యేక కలెక్టర్ ఎంవీ సుధాకర్‌రాజు, ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు, ఇతర అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి షటిల్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

పొదలకూరు : కాకాణి రమణారెడ్డి స్మారకార్థంగా వినాయక షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో పొదలకూరులో నిర్వహిస్తున్న ఐదు జిల్లాల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. నాలుగు విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. మెన్స్ ఓపెన్ విభాగంలో యశ్వంత్, హర్ష(పొదలకూరు) ప్రథమ, బషీర్, రూపేష్ (గూడూరు) ద్వితీయ, శరత్, ప్రణీత్‌రాజ్(తిరుపతి) తృతీయ, ఇర్షాద్, సాయి(గూడూరు) నాలుగో స్థానాల్లో నిలిచారు. వెటరన్స్ 40+ విభాగంలో కలాం, ఇంతియాజ్(గూడూరు) ప్రథమ, సమీర్, నారాయణరావు(నెల్లూరు) ద్వితీయ, అయితా రమేష్, శేషారెడ్డి(పొదలకూరు) తృతీయ, శ్రీనివాసులురెడ్డి, హరికృష్ణ(పొదలకూరు) నాలుగో స్థానాలను కైవసం చేసుకున్నారు. వెటరన్ 50+ విభాగంలో చంద్రారెడ్డి, శంకర్‌నారాయణ(నెల్లూరు) ప్రథమ, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి(నెల్లూరు) ద్వితీయ, నారాయణరెడ్డి, రాధాకృష్ణ(పొదలకూరు) తృతీయ, లక్ష్మీనారాయణ, పెంచలయ్య(పొదలకూరు) నాలుగో స్థానాల్లో నిలిచారు. లోకల్‌పూల్ విభాగంలో భాస్కర్‌రెడ్డి, బాలపెంచలయ్య ప్రథమ, శ్రీధర్, బాలసుబ్రహ్మణ్యం ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వూకోటి లక్ష్మీనారాయణ, బీపీ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మెమెంటోలు, నగదు బహుమతులను అందజేశారు.

చీటింగ్ కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు పోలీసులు సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై ఆనంద్‌భాస్కర్‌బాబు వివరాల మేరకు ఊటుకూరుకు చెందిన లేబూరు రమేష్‌బాబు స్థానికంగా ఆక్వాసాగుకు వినియోగించే ఏరియేటర్లను అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మర్రిపాడు మండలంలోని ఏపిలగుంట గ్రామానికి చెందిన నాయుడు వెంకటరమణయ్య, అతని స్నేహితుడు మహేంద్ర ఇటీవల రమేష్‌బాబు వద్దకు వచ్చి తాము ఈ ప్రాంతంలో రొయ్యల సాగు చేస్తున్నామని, తమకు ఏరియేటర్లు అద్దెకు కావాలని అడిగారు. దీంతో రమేష్‌బాబు తన వద్ద ఉన్న 28 ఏరియేటర్లను అద్దెకు ఇచ్చి ఆ సమయంలో కొంత నగదును కూడా తీసుకున్నాడు. అయితే రొయ్యల సాగు పూర్తిగా అయిపోయినప్పటికీ వెంకటరమణయ్య, మహేంద్ర తన ఏరియేటర్లను ఇవ్వకపోవడంతో రమేష్‌బాబు వారికి ఫోన్ చేశాడు. అయితే వారి ఫోన్లు స్విచ్‌ఆఫ్ రావడంతో అనుమానంతో స్థానికంగా రొయ్యల సాగు చేసే వారిని సంప్రదించగా వెంకటరమణయ్య, మహేంద్ర అసలు రొయ్యల సాగు చేయడం లేదని, తన వద్ద తీసుకున్న ఏరియేటర్లు మరెవరికో విక్రయించేశాడని తెలుసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

- లోతట్టు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యక్రమాలు
- రాజమండ్రి నుంచి వచ్చిన మత్స్యకారుల నిర్వాకం
- ఓ హత్య కేసును విచారిస్తుండగా మరో హత్యోదంతం వెలుగులోకి..
- అలివి వలలతో చేపలవేట, నాటుసారా.. ఇలా మరెన్నో


జలాశయ లోతట్టు ప్రాంతంలో అక్రమంగా అలివి వలలతో చేపలు పడుతున్న రాజమండ్రి మత్స్యకారులు

జలాశయ ప్రాంతం..
అక్రమాల కేంద్రం

ఆత్మకూరు: సోమశిల జలాశయ లోతట్టు ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ నిఘా కొరవడడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆ లోతట్టు ప్రాంతం నెల్లూరు–వైఎస్సార్ జిల్లాల సరిహద్దు కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు అంటున్నారు. సోమశిల జలాశయ లోతట్టు ప్రాంతంలో ఆరు నెలల క్రితం ఓ వ్యక్తిని చంపి కాల్చేశారని, ఆ మృతదేహం సరిగ్గా కాలకపోవడంతో గోతంలో చుట్టి దానికి బండరాయి కట్టి నీళ్లలో పడేశారని పుకార్లు వచ్చాయి. దీనికి కొన్ని ఆనవాళ్లు దొరకడంతో ఆత్మకూరు సీఐ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఇలా వెలుగులోకి వచ్చింది

మూడు నెలల క్రితం కలువాయి మండల అటవీ ప్రాంతంలో సగం కాలిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించారు. దీని గురించి పోలీసులు విచారణ చేపట్టారు. ఆ కేసు విచారణలో భాగంగా స్పెషల్ పార్టీ పోలీసులు వారం రోజుల పాటు సోమశిలలో తిష్టవేసి విచారణ చేపట్టడంతో జలాశయంలోని లోతట్టు ప్రాంతంలో మరో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. జలాశయం లోతట్టు ప్రాంతంలో చేపల వేటకు రాజమండ్రికి చెందిన కొందరు కూలీలతో పాటు సురేష్ (40) అనే యువకుడిని తీసుకొచ్చారు. లోతట్టు ప్రాంతాల్లో కొంత అటవీ మైదానంలో వీరు గుడిసెలు వేసుకుని నాటుసారా కాయడం, చేపలు పట్టడం లాంటివి చేస్తుంటారు. అక్కడ కూలీల మధ్య జరిగిన గొడవలో తాగిన మైకంలో సురేష్ అనే యువకుడిని కొట్టడంతో అతను మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ఆనవాళ్లు లేకుండా కాల్చేశారని పోలీసు విచారణలో వెలుగులోకి వచ్చింది. అయితే తాగిన మైకంలో కొట్టి చంపారా లేక ఇతర కారణాలు ఉన్నాయా.. అనేదానిపై పూర్తి స్థాయిలో విచారిస్తే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అనేక అసాంఘిక కార్యక్రమాలు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జలాశయం ఎగువ ప్రాంతంలో అలివి వలలతో చేపలు పట్టడం చేస్తుంటారు. కొందరు వ్యక్తుల గుత్తాధిపత్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. రాజమండ్రి నుంచి వచ్చిన కూలీలు మాత్రమే అలివి వలలను వేయడం, చేపలు పట్టడం లాంటివి చేయగలుగుతారని, స్థానికులు ఆ వలలు వేయలేరని మత్స్యకారులు తెలిపారు. ఈ అలివి వలతో వేట సాగించడం కోసం రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి యువకులను తీసుకురావడం పరిపాటి. వీటిని నిషేధించాలని అప్పటి మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డికి స్థానిక మత్స్యకారులు విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి అలివి వలలతో వేటను నిలిపివేశారు. అయితే ఇటీవలి కాలంలో తిరిగి అలివి వలలతో వేట సాగుతోంది. ఈ క్రమంలో లోతట్టు ప్రాంత సమీపంలోని అటవీ భాగంలో నాటుసారా కాయడం, ఒక్కోసారి అక్రమంగా ఎర్రచందనం దుంగలను సైతం దాచిపెట్టడం లాంటి అసాంఘిక కార్యకలాపాలు అక్కడ చేస్తుంటారని సమాచారం. కాగా ఐదు నెలల క్రితం సురేష్ అనే యువకుడిని హత్య చేసి ఆనవాళ్లులేకుండా చేసిన విషయాన్ని సోమశిలకు చెందిన స్థానిక వ్యక్తి ఆధ్వర్యంలో జరిగిందని అనంతరం అతను అడిగిన మేరకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆలస్యంగా కొందరికి చెప్పాడని స్థానికులు అంటున్నారు.

మూడు రోజులుగా విచారణ

జలాశయం ఎగువ ప్రాంతంలో సురేష్ అనే యువకుడిని చంపిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆత్మకూరు సీఐ కె నాగేశ్వరరావు గత మూడు రోజులుగా పూర్తి స్థాయిలో విచారణ చేసి అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగింది వాస్తవమేనని ఆయన తెలిపారు. అయితే ఆ ప్రదేశం అన్నమయ్య జిల్లా చిట్వేల్ ప్రాంత పోలీసు స్టేషన్ పరిధిలోది కావడంతో పూర్తి వివరాలను ఆ పోలీసులకు అందజేశామని, అదే క్రమంలో నెల్లూరు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఏది ఏమైనా జిల్లా సరిహద్దు ప్రాంతం కావడం, జనసంచారం ఎక్కువగా లేకపోవడం లాంటి కారణాలతో జలాశయం ఎగువ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు అప్పుడప్పుడు చోటు చేసుకుంటున్నా కొన్ని మాత్రమే ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. ఇరు జిల్లాల పోలీసులు, అటవీశాఖ, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో నిఘా పెడితే ఇలాంటి కార్యకలాపాలు అదుపులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.

ఆ వ్యక్తి మృతిపై కేసు నమోదు

సోమశిల : సోమశిల జలాశయ లోతట్టు ప్రాంతంలో ఆరు నెలల క్రితం జాలరి సురేష్ (40) మృతిపై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనపై అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఘటన స్థలం అన్నమయ్య జిల్లా చిట్వేల్ పరిధి కావడంతో కేసును అక్కడకు బదిలీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు			
బ్రాయిలర్:	రూ.130	బ్రాయిలర్ చికెన్:	రూ.226
లేయర్	రూ.85	స్కిన్‌లెస్ చికెన్:	రూ.250
		లేయర్ చికెన్:	రూ.145

పొదలకూరు నిమ్మధరలు (కిలో)	
పెద్దవి : రూ.16	పండ్లు : రూ.4
సన్నవి : రూ.10	